
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
కృష్ణా జిల్లా వార్తలు
బుధవారం 9 అక్టోబరు 2024



నేటి అలంకారం
శ్రీసరస్వతీదేవి
మూలానక్షత్రం



శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఆరో రోజు మంగళవారం కనకదుర్గమ్మ అదృష్టం, విలాసం, ఐశ్వర్యం, సంపద, శ్రేయస్సులకు ప్రదాత అయిన లక్ష్మీదేవిగా దర్శనమివ్వగా అమ్మ దివ్య మంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకూ క్యూలైన్లలో రద్దీ కొనసాగింది. ఒంటినిండా బంగారం, పుష్పాలంకరణలో ఐశ్వర్య ప్రదాయిని రూపాన్ని తిలకించి తరించారు. సాయంత్రం అమ్మవారి నగరోత్సవం కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



కళాకారిణి నృత్య భంగిమ

కృష్ణమ్మకు హారతి



శ్రీమహాలక్ష్మీదేవిగా దర్శనం





దుర్గమ్మ నగరోత్సవం

ఐశ్వర్య ప్రదాయిని

ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

మంగళవారం పెరిగిన రద్దీ | సందడిగా క్యూలైన్లు, పరిసరాలు | శ్రీమహాలక్ష్మీదేవిగా అమ్మ దర్శనం



కుంకుమార్చన

విజయవాడ/చిట్టినగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రుల్లో ఆరో రోజు మంగళవారం ఇంద్రకీలాద్రికి భక్తుల రద్దీ పెరిగింది. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులతో తెల్లవారుజాము నుంచి అన్ని క్యూలు నిండిపోయాయి. కనకదుర్గమ్మ మంగళవారం శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, డీజీపీ ద్వారకా తిరుమలరావు, శివస్వామి, సినీనటి హేమ దర్శించుకున్నారు. అన్నవరం దేవస్థానం అధికారులు, అర్చకులు అమ్మవారికి పట్టువస్త్రాలను, పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకాతిరుమల నుంచి పట్టుచీర సమర్పించారు. ఇంద్రకీలాద్రిపై మంగళవారం సాధారణంగానే కనిపించింది. మామూలు రోజుల్లో ఆదివారం, మంగళవారం, శుక్రవారం భక్తులు అధికంగా వస్తుంటారు. ఈ రోజుల్లో 50 వేల నుంచి 60 వేల వరకు భక్తుల సంఖ్య ఉంటుంది. ఆ స్థాయిలోనే భక్తులు వచ్చారని ఆలయ అధికారులు అంచనా వేశారు. విజయవాడకు చెందిన ఓ మహిళ రూ.500 క్యూలో వచ్చి రాజగోపురం వద్ద సొమ్మసిల్లి పడిపోయింది. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వారి సందడి ఎక్కువగా కనిపించింది. మధ్యాహ్నం నుంచి కాణిపాకం దేవస్థానం అధికారులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనధికార దర్శనాలు పెరిగిపోవడంతో పోలీసులు కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నారు. వీఐపీలకు కేటాయించిన 9-11, 2-4 స్లాట్‌ల్లో కాకుండా ఇతర సమయాల్లో వస్తే వారిని వీఐపీ మార్గంలో దర్శనాలకు అనుమతించడంలేదు. వారిని రూ.500 క్యూలో పంపుతున్నారు. అమ్మవారు బుధవారం మూల నక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. లక్షలాది మంది భక్తులు ఈ దర్శనానికి వచ్చే అవకాశం ఉండడంతో మరింత కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేస్తున్నారు.



భక్తులతో క్యూలైన్ కిటకిట



నేడు మూలా నక్షత్రం.. అందరికీ సర్వదర్శనం



రైళ్లు ఫుల్..



జై దుర్గా భవానీ..

8లో

తమ్ముళ్ల సిండికేటు!



దోపిడీ, అక్రమాలకు తావులేకుండా కూటమి ప్రభుత్వం తెచ్చిన నూతన మద్యం పాలసీని తమ్ముళ్లు తమ స్వార్థానికి వాడుకుంటున్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో మద్యం షాపుల కోసం పోటీలు పడుతున్నారు. కొందరు నేతలు టెండర్లలో పాల్గొని షాపులు వస్తే వ్యాపారం చేసుకుందామనుకుంటుంటే మరికొందరు నేతలు సిండికేట్లను నడిపిస్తూ ఇతరులెవ్వరినీ దరఖాస్తులే వేయనివ్వకుండా అడ్డుకుంటున్నారు. అవసరమైతే గొడవలకు దిగి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే దరఖాస్తులు

- ఇతరులు దరఖాస్తు వేస్తే బెదిరింపులు
- కృష్ణాజిల్లా వ్యాప్తంగా సిండికేట్ల జోరు
- ఎన్టీఆర్‌లో 113 షాపులకు 6,121 దరఖాస్తులు
- కృష్ణాలో 123 దుకాణాలకు 1,038 మాత్రమే..

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో ప్రైవేటు షాపులకు దరఖాస్తులు ఆహ్వానించిన నేపథ్యంలో కొందరు అధికార పార్టీ నేతలు దరఖాస్తుల ప్రక్రియను అవకాశంగా తీసుకుని దందాలు చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 113 దుకాణాలకు మంగళవారం నాటికి 6,121 దరఖాస్తులు వచ్చాయి. కృష్ణాజిల్లాలో 123 షాపులకు కేవలం 1,038 దరఖాస్తులే అందాయి. కృష్ణాజిల్లాలో మద్యం సిండికేట్‌ను అధికార పార్టీ నాయకులే నడిపిస్తున్నారు. దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ వీరు చెప్పిన వారే మద్యం షాపులకు దరఖాస్తు చేస్తున్నారు. వేరే ఎవరైనా దరఖాస్తు చేసుకున్నా.. మున్ముందు వ్యాపారం చేయలేరంటూ బెదిరిస్తుండటంతో వారు దరఖాస్తుల కోసం డీడీలు తీసి క్యాన్సిల్ చేసుకుంటున్న ఉదంతాలు వెలుగు చూస్తున్నాయి.

● గుడివాడ నియోజకవర్గంలో గుడివాడ మున్సిపాలిటీలో ఏడు దుకాణాలు ఉండగా, అన్ని దుకాణాలకు మూడు చొప్పున మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. గుడివాడ రూరల్ మండలంలోనూ ఇదే పరిస్థితి. ఇక్కడ రెండు దుకాణాలు ఉండగా మూడు చొప్పున ఆరు దరఖాస్తులు వచ్చాయి. అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే ఈ దరఖాస్తులు చేసినట్లు సమాచారం. నందివాడలో నాలుగు మద్యం దుకాణాలకు ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు రావడం గమనార్హం. గుడ్లవల్లేరు మండలంలో ఆరు దుకాణాలు ఉండగా 13 దరఖాస్తులు వచ్చాయి.

● పెడన నియోజకవర్గంలో పొరుగు జిల్లాకు చెందిన వ్యక్తి కనుసన్నల్లో టెండర్ల దరఖాస్తు వ్యవహారం నడుస్తోంది. భీమవరానికి చెందిన ఈయన తాను ఎమ్మెల్యే సామాజికవర్గానికి చెందినవాడినంటూ.. తనకు ఎమ్మెల్యే ఆశీస్సులు ఉన్నాయని స్థానిక టీడీపీ నాయకులనూ బెదిరిస్తూ దరఖాస్తులు వేయనివ్వడం లేదని తెలిసింది. ఆన్‌లైన్‌లో వేసినా మున్ముందు మీరు వ్యాపారం చేసుకోలేరంటూ బెదిరిస్తున్నట్లు సమాచారం. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో మొత్తం ఏడు షాపులకు ఈయన మాత్రమే దరఖాస్తు వేయడం గమనార్హం. బంటుమిల్లిలో మూడు దుకాణాలకు 11 దరఖాస్తులు రాగా, కృత్తివెన్ను మండలంలో నాలుగు దుకాణాలకు 12 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.

● పామర్రు నియోజకవర్గంలోనూ అధికార పార్టీ నేతలు కొందరు ఎమ్మెల్యే పేరు చెప్పి ఎవ్వరినీ దరఖాస్తు చేసుకోనివ్వడం లేదని తెలిసింది. అధికార పార్టీ నాయకులే సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తులు చేస్తున్నారని సమాచారం. పామర్రు మండలంలో నాలుగు దుకాణాలు ఉండగా 30 దరఖాస్తులు వచ్చా యి. తోట్లవల్లూరులో మూడు దుకాణాలకు 25, పమిడి ముక్కలలో రెండు దుకాణాలకు 41, పెదపారుపూడిలో 2 దుకాణాలకు 29 దరఖాస్తులు అందాయి.

● పెనమలూరు నియోజకవర్గంలోనూ అధికార పార్టీ సిండికేట్ పొరుగు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులనూ తమ నియోజకవర్గ పరిధిలోకి రానివ్వడం లేదు. ఉయ్యూరులో తొమ్మిది దుకాణాలు ఉండగా 28 దరఖాస్తులు వచ్చాయి. కంకిపాడులో ఏడు దుకాణాలకు 55 దరఖాస్తులు రాగా, వైఎస్సార్ తాడి గడప మున్సిపాలిటీ పరిధిలోని మూడు దుకాణాలకు 98, పెనమలూరు మండలంలోని ఐదు దుకాణాలకు 33 దరఖాస్తులు వచ్చాయి.

● ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర నియోజకవర్గం మచిలీపట్నంలో పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. ఇక్కడ ఎనిమిది దుకాణాలు ఉండగా 98 దరఖాస్తులు వచ్చాయి. అవనిగడ్డ నియోజకవర్గంలోనూ ఎవరికి వారు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో సిండికేట్ల వ్యవహారం పెద్దగా కనిపించడం లేదు.

● గన్నవరం నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో సిండికేట్ నడుస్తోంది. మద్యం షాపుల కోసం టీడీపీలోనే ఆధిపత్య పోరు తీవ్రమైంది. గన్నవరం మండలంలోని తొమ్మిది దుకాణాలకు 103, బాపులపాడు మండలంలోని తొమ్మిది షాపులకు 14, ఉంగుటూరు మండలంలో ఐదు దుకాణాలకు 13 దరఖాస్తులు వచ్చాయి.

దరఖాస్తుల వెల్లువ

ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని కార్పొరేషన్, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, మండలాల్లో సగటున దుకాణానికి 46 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 113 దుకాణాలకు గాను మంగళవారం నాటికి 6,121 దరఖాస్తులు వచ్చాయి. విజయవాడ నగరంలో ఎంపిక చేసిన దుకాణాలకు మాత్రమే ఓ ప్రజాప్రతినిధి ఆధ్వర్యంలో సిండికేట్ అతి తక్కువ సంఖ్యలో దరఖాస్తులు చేసుకుంది. ఇలాంటి దుకాణాలు ఎనిమిది వరకు ఉంటాయి. ఈ దుకాణాలకు సింగిల్ డిజిట్‌లోనే దరఖాస్తులు రావడం గమనార్హం. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 39 షాపులు ఉన్నాయి. వీటికి 4,312 దరఖాస్తులు వచ్చాయి. విజయవాడ రూరల్‌లో 10 షాపులు ఉండగా 120 దరఖాస్తులు వచ్చాయి.

గన్నవరంలో రోడ్డెక్కిన తమ్ముళ్లు

గన్నవరం ఎక్సైజ్ స్టేషన్ వద్ద గత రెండు రోజులుగా మద్యం షాపులకు టెండర్ వేసేందుకు వచ్చేవారిని అధికార పార్టీ నాయకుల పేరుతో కొందరు అడ్డుకుంటుండటంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంటోంది. మంగళవారం అధికార పార్టీ నాయకుల్లోని రెండు వర్గాలు దరఖాస్తులు వేసే విషయంలో ఘర్షణకు దిగారు. మద్యం షాపు కోసం దరఖాస్తు వేసేందుకు ముస్తాబాదకు చెందిన టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కంచర్ల ఈశ్వరరావు వెళ్లారు. కారు ఆపి దిగగానే తెలుగు యువత నాయకుడు పరుచూరి నరేష్ మరికొంతమంది యువకులు వచ్చి 'ఏంట్రా నా కొడక నీ వెనుక ఎవరు న్నార్రా?' అని ఘర్షణ పడ్డారు. అయ్యప్ప స్వామి మాలలో ఉండి కూడా ఆ మాటలేంటని ఈశ్వరరావు ప్రశ్నించడంతో నరేశ్ మరింత రెచ్చిపోయి ఆయనపై దాడికి దిగి టెండరు దరఖాస్తును చించేయడంతో వారు చేసేది లేక వెనుదిరిగి వెళ్లిపోయారు. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల్లో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసేందుకు వచ్చేవారిని స్టేషన్ బయట ఆపి టెండర్‌లు వేయవద్దని.. వేసినా ఫలితం ఉండదని బెదిరిస్తున్నారు. టెండర్ వేస్తే డీడీలు వెనక్కి తీసుకోవాలని లేకపోతే ఇబ్బందులు పడతారని హెచ్చరిస్తున్నారు.

అక్రమార్కులపై చర్యలేవి?



వైసీపీ పాలనలో హౌసింగ్ ఏఈల చేతివాటం

కాంట్రాక్టర్, ట్రాన్స్‌పోర్టర్ అవతారాలెత్తి మరీ దందా

- అవనిగడ్డ, చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల మండలాల్లో సిమెంట్, ఐరన్ మాయం
- అధికారుల విచారణలో అక్రమాలు నిజమేనని తేలినా నేటికీ చర్యలు శూన్యం

పేదల సొంతింటి కలను నిజం చేయడంలో కీలకపాత్ర పోషించే హౌసింగ్ ఏఈలు ప్రజాధనంపై కన్నేశారు. లబ్ధిదారులకు దక్కాల్సిన లక్షల రూపాయలు విలువ చేసే ఇనుము, సిమెంట్ బస్తాలను మాయం చేశారు. ఇది చాలదన్నట్లు ఇళ్లు నిర్మించి ఇస్తామని ఒకరు కాంట్రాక్టర్ అవతారమెత్తితే మరొకరు గూడౌన్ నుంచి మెటీరియల్ మీ ఇంటికే చేరవేస్తామని ట్రాన్స్‌పోర్టర్‌గా మారారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల అవినీతి, అక్రమాలు తారాస్థాయికి చేరడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. వీటిపై విచారణ జరిపిన అధికారులు నిజమేనని తేల్చినా నేటి వరకు చర్యలు తీసుకోకపోవడంపై లబ్ధిదారుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : అవనిగడ్డ నియోజకవర్గంలోని అవనిగడ్డ, చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల మండలాల్లో గృహ నిర్మాణశాఖలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఐదేళ్ల వైసీపీ పాలనలో తీవ్ర అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని లబ్ధిదారుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. పామర్రు నియోజకవర్గం మొవ్వ మండలంలో పనిచేసే మహిళా వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను వైసీపీ ప్రభుత్వంలో చల్లపల్లి మండలం గృహ నిర్మాణశాఖ ఏఈగా నియమించారు. ఈమె చల్లపల్లిలో బాధ్యతలు తీసుకున్న తర్వాత పేదల గృహ నిర్మాణాలకు సిమెంటు, ఇనుము ఇవ్వకుండానే ఇచ్చినట్లుగా రికార్డులో నమోదు చేసి, 1300 సిమెంటు బస్తాలు, ఏడు టన్నుల ఇనుము మాయం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అవనిగడ్డలో రెండు అంతస్తుల భవనం నిర్మించుకున్నారని ఆమెపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. దీనిపై అధికారులు విచారణ జరిపి నివేదికను రూపొందించారు. ఈ విచారణ అనంతరం ఆమెపై చర్యలు తీసుకోకుండా మచిలీ పట్నంలోని జిల్లా గృహనిర్మాణశాఖ కార్యాలయానికి బదిలీ చేశారు. అయితే ఈ వ్యవహారంలో అక్కడే పనిచేసే డీఈ తెరవెనుక చక్రం తిప్పారనే విమర్శలు ఉన్నాయి.

వ్యాన్ కొనుగోలు చేసి మరీ రవాణా

ఘంటసాల మండలంలో గృహ నిర్మాణ లబ్ధిదారులకు సిమెంటు, ఇనుము ఇచ్చేందుకుగాను గూడౌన్ ఉంది. ఈ మండల ఏఈ ఒక వ్యాన్ కొనుగోలు చేసి లబ్ధిదారులు ఇనుము, సిమెంటు కోసం వస్తే తన వ్యాన్‌లోనే రవాణా చేయాలని నిబంధనపెట్టాడు. తన మనిషిని వ్యాన్ డ్రైవర్‌గా పెట్టుకుని, అతనికే గూడౌన్ తాళాలు ఇచ్చి అవకాశం ఉన్నంతవరకు ఇనుము, సిమెంటును దొడ్డిదారిన తరలించుకుపోయారు. ఈయనే అవనిగడ్డ మండలం ఇన్‌చార్జి ఏఈగాను పనిచేశారు. రెండు మండలాల్లో రూ.15 లక్షల నుంచి 20 లక్షల వరకు ఇనుము, సిమెంటు మాయం చేశారని ఈయనపై ఉన్న తాధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ ఏఈ అక్రమాలపైన అధికారులు విచారణ చేసి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు.

ఇళ్ల నిర్మాణానికి భారీగా వసూలు

అవనిగడ్డ మండలం గృహ నిర్మాణశాఖలో - మిగతా 8లో


ఆన్‌లైన్ షేర్స్ ట్రేడింగ్ పేరుతో రూ.49 లక్షలకుపైగా టోకరా!

పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

8లో

ఐదోరోజు ఆదాయం
రూ.58.97లక్షలు

వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దసరా మహోత్సవాలు సోమవారం నాటికి ఐదురోజులు ముగిశాయి. సోమవారం మహాచండీ అలంకారంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చింది. ఐదోరోజు భక్తుల నుంచి రూ.500 టిక్కెట్ల ద్వారా రూ.23,71,500, రూ.300 టిక్కెట్ల ద్వారా రూ.5,97,000, రూ.100 టిక్కెట్ల ద్వారా రూ.5,06,300 ఆదాయం సమకూరింది. 33,282 లడ్డూల విక్రయం ద్వారా, రూ.4,99,230, ఆరు లడ్డూలు ప్యాకింగ్ ద్వారా రూ.16,20,900 ఆదాయం సమకూరింది. పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన రూ.3000 టికెట్ల ద్వారా రూ.84వేలు, రూ.5000 టికెట్ల ద్వారా రూ.25వేలు ఆదాయం వచ్చింది. పరోక్ష ప్రత్యేక చండీహోమం టిక్కెట్ల ద్వారా రూ.60వేలు, శ్రీచక్ర నవావరణార్చన టికెట్ల ద్వారా రూ.15వేలు ఆదాయం సమకూరింది. ప్రత్యేక ఖడ్గమాలార్చన టిక్కెట్ల ద్వారా రూ.10,232, ఇతరత్రా రూ.1,650లు, పబ్లికేషన్‌లు, ఫోటోలు, క్యాలెండర్ల ద్వారా రూ.5,110లు ఆదాయం సమకూరింది. తలనీలాల సమర్పణ టిక్కెట్ల ద్వారా రూ.1,01,360లు ఆదాయం వచ్చింది. ఐదోరోజు సోమవారం మొత్తంగా కనకదుర్గమ్మవారికి రూ.58,97,282లు ఆదాయం సమకూరింది.



జై దుర్గా భవానీ!..



కాణిపాకం నుంచి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, దేవస్థానం ఈవో పట్టెం గురుప్రసాద్

కనకదుర్గమ్మకు కాణిపాకం నుంచి
పట్టువస్త్రాల సమర్పణ

వన్‌టౌన్, అక్టోబరు 8 : దసరా మహోత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారికి చిత్తూరు జిల్లా కాణిపాకం వరసిద్ధి వినాయక దేవస్థానం నుంచి పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, దేవస్థానం ఈవో పట్టెం గురుప్రసాద్ తదితరులు మంగళవారం పట్టువస్త్రాలను సమర్పించారు. ఈవో రామారావు, తదితరులు వారికి సాదర స్వాగతం పలికారు. అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించిన అనంతరం వారికి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు, చిత్రపటాలు అందజేశారు. ఇదే సమయంలో ఈవో రామారావుకు కాణిపాకం వరసిద్ధి వినాయక దేవస్థానం తరఫున శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కె.మురళీమోహన్ మాట్లాడుతూ, ప్రతీపేడాది దసరా మహోత్సవాల్లో కాణిపాకం దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని, ఈఏడాది తనకు ఈ అవకాశం రావటం పూర్వజన్మ సుకృతమని అన్నారు. అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రతిఒక్కరికీ కలగాలని కోరుకున్నానన్నారు.



» క్యూలలో భక్తుల రద్దీ..



» అంతరాలయంలో..



» నగరోత్సవంలో..



మూల నక్షత్రం
నేడు అందరికీ సర్వదర్శనం

» అవసరమైన చోట ట్రాఫిక్ నియంత్రణలు
» సీఎం రాక సందర్భంగా పటిష్ట ఏర్పాట్లు
» 1100 మంది పోలీసులతో టీమ్‌లు

వన్‌టౌన్, అక్టోబరు 8 : ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలలో కీలక ఘట్టం నేడు జరగనుంది. అమ్మవారు బుధవారం మూల నక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి అలంకారంలో దర్శనం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను సమర్పించనుండగా ఇందుకు అవసరమైన ఏర్పాట్లను చేశామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చెప్పారు. మంగళవారం దుర్గగుడి మోడల్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు వివిధ విభాగాల అధికారులతో ఆయన మూలా నక్షత్రం నాడు ఏర్పాట్లు, ముఖ్యమంత్రి రాక సందర్భంగా బందోబస్తు, సామాన్య జనానికి ఇబ్బందులు లేకుండా అమ్మవారి దర్శనాలను కల్పించటంపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పెద్ద ఎత్తున తరలివచ్చే భక్తులకు సులభతరంగా అమ్మవారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశారన్నారు. పాలు, మజ్జిగ, తాగునీరు, అవసరమైన ప్రతిభక్తుడికి క్యూలలో అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించే సమయంలో మూడు క్యూలలో భక్తులను దర్శనానికి అనుమతించటం జరుగుతుందన్నారు. ఏ ఒక్క భక్తుడు కూడా ఇబ్బంది పడకూడదని ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. బుధవారం అమ్మవారి దర్శనం టిక్కెట్ల జారీని నిలిపివేశామని, అందరికీ ఉచిత దర్శనమేనని తెలిపారు. బుధవారం తెల్లవారుజాము నుంచి దర్శనాలు ప్రారంభమవుతాయని, మధ్యాహ్నం రెండు, మూడు గంటల మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు సతీసమేతంగా ఇంద్రకీలాద్రికి చేరుకుని రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారన్నారు. ముఖ్యమంత్రిని ఇప్పటికే దేవస్థానంలో జరిగే కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వానించామన్నారు. ఎవరికీ అంతరాలయ ప్రవేశం లేదని చెప్పారు. ముఖ్యమంత్రి భద్రతా విభాగం సూచించిన కొద్ది మంది ప్రజాప్రతినిధులకు మాత్రమే అంతరాలయ దర్శనం ఉంటుందన్నారు. దర్శనానంతరం చంద్రబాబుకు వేదాశీర్వచనం, శేషవస్త్ర సమర్పణ తదితరాలు ఉంటాయన్నారు. ఇటీవల నగరంలో కొన్ని ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడి సంభవించిన ప్రమాదాలకు చెందిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రదర్శిస్తున్నామని ముఖ్యమంత్రి సమయాన్ని బట్టి ఈ ఎగ్జిబిషన్‌ను చూసే అవకాశం ఉందని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రాక సందర్భంగా నగరంలో కొన్ని ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నామని తెలపారు. డైనమిక్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా ఎప్పటికప్పుడు సమయానుకూలంగా ఈ ఆంక్షలు ఉండే అవకాశం ఉందన్నారు. కనకదుర్గా ఫ్లైఓవర్ మీద ఎటువంటి ఆంక్షలు లేవని, కాళేశ్వరరావు మార్కెట్ వద్ద ఫ్లై ఓవర్‌పై రాకపోకలు పూర్తిగా నిషేధించామన్నారు. ఇప్పటికే విధులలో 4,500 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తుండగా, అదనంగా మరో 1100 మంది పోలీసులను 110 బృందాలుగా ఏర్పాటుచేసి హోల్డింగ్ టీమ్‌లుగా విధులు కేటాయించినట్టు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, చిత్రంలో కలెక్టర్ సృజన, సీపీ రాజశేఖర్‌బాబు



» కుంకుమ పూజలో దంపతులు



» దుర్గమ్మ సేవలో మంత్రి ఆనం



నిందితులను మీడియా ఎదుట చూపిస్తున్న ఎస్పీ గంగాధర్ రావు

గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం

» ఎస్పీ గంగాధర్ రావు
» 15 మంది అరెస్టు, 8 కేజీల గంజాయి స్వాధీనం

పెదపారుపూడి, అక్టోబరు 8 : జిల్లాలో గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు తెలిపారు. మంగళవారం పెదపారుపూడి స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. బహిరంగ ప్రదేశంలో గంజాయి సేవిస్తూ విక్రయాలకు పాల్పడుతున్నట్టు అందిన సమాచారం మేరకు.. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో పెదపారుపూడి ఎస్ఐ ప్రతాప్‌కుమార్ రెడ్డి సిబ్బందితో తనిఖీలు చేశారు. పెదపారుపూడి గ్రామ శివారు స్మశానంలో 16 మంది వ్యక్తులు గంజాయి సేవిస్తూ వారి వద్ద ఉన్న గంజాయిని విక్రయించటానికి పంచుకుంటున్నారన్నారు. 15మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 8 కిలోల గంజాయి, ఒక మోటార్ సైకిల్, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అనంతరం 15 మందిని అదుపులోకి తీసుకుని విచారించగా, ఆరుగురు వ్యక్తులు రూ.16 వేలతో 2 మోటార్ సైకిళ్లపై అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరు వెళ్లి రూ.10 వేలకు 10 కిలోల గంజాయి కొనుగోలు చేశారని, మిగిలిన మొత్తం మార్గమధ్యలో భోజనాలకు ఖర్చు చేసినట్టు తెలిపారు. గంజాయిని 16 మంది పంచుకునే ముందు మద్యం తాగటం కోసం ఫణీంద్ర అనేవ్యక్తి ద్విచక్ర వాహనంపై బీరు బాటిల్స్ కోసం వెళ్లినట్టు, మిగిలిన రెండు కిలోల గంజాయి అతడి వద్ద ఉన్నట్టు ఎస్పీ వివరించారు. 15 మంది చెప్పిన సమాచారం ప్రకారం.. అతడ్ని పట్టుకోవటానికి వెళ్లగా పరారయ్యాడన్నారు. కేసును పామర్రు సీఐ వి.శుభాకర్ దర్యాప్తు చేశారన్నారు. కేసులో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉండగా వారికోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ తెలిపారు. గంజాయికి సంబంధించి ఏలాంటి సమాచారం తెలిసినా వెంటనే తెలియజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.

ఆన్‌లైన్ షేర్స్ ట్రేడింగ్ పేరుతో
రూ. 49 లక్షలకు పైగా టోకరా!

» పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

పెనమలూరు, అక్టోబరు 8 : ఆన్‌లైన్‌లో షేర్లు ట్రేడింగ్ చేస్తే అధిక లాభాలొస్తాయంటూ రూ.49 లక్షలకు పైగా మోసం చేసిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకికి చెందిన వెంకట కోటేశ్వరరావు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేస్తాడు. అతడి ఫోన్‌కు వాట్సాప్‌లో ఆన్‌లైన్ షేర్స్ ట్రేడింగ్ పేరుతో ఒక లింక్ వచ్చింది. అందులో ఖాతా తెరిచి ఆన్‌లైన్‌లో షేర్లు ట్రేడింగ్ చేసురేంటే అధిక లాభాలొస్తాయని మెసేజ్ వచ్చింది. అది నమ్మిన వెంకట కోటేశ్వరరావు ఖాతా తెరిచి కొన్ని షేర్స్ ట్రేడ్స్, ఐపీవోలలో 49.20లక్షలు విడతల వారీగా పెట్టుబడి పెట్టాడు. సదరు మొత్తం వారు పంపిన ఆరు ఖాతాలకు అతను, వారి బంధువు కందుల లక్ష్మణకుమార్ జమచేశారు. తర్వాత కొద్ది రోజులకు మీరు పెట్టుబడి పెట్టిన డబ్బు లాభాలతో కలిపి రూ.2.82కోట్లు అయిందని.. సదరు డబ్బును విత్‌డ్రా చేసుకోవాలంటే 20శాతం కమీషన్ చెల్లించాల్సి ఉంటుందని, తమ కంపెనీ పదిశాతం చెల్లిస్తుందని, మిగిలిన పదిశాతం సొమ్ము రూ.28,26,649 ఖాతాదారు చెల్లించాలని, లేనిపక్షంలో ఖాతాదారు సొమ్ము విత్‌డ్రా అవదని వెబ్‌సైటు నిర్వాహకులు తెలిపారు. దీంతో మోసపోయానని తెలుసుకున్న వెంకట కోటేశ్వరరావు పెనమలూరు పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

హోమగుండం కోసం..

» దీక్షల విరమణకు.. 3 లక్షల మంది భవానీల ఎదురుచూపు
» ఏర్పాటుపై స్పష్టత రాకపోవటంతో.. ఉత్సవాలలో కానరాని భవానీలు
» 13న లక్షన్నర మంది వస్తారని అంచనా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/వన్‌టౌన్)

దసరా ఉత్సవాలలో భవానీలు దీక్షల విరమణ చేపట్టే విషయంలో హోమగుండం ఏర్పాట్లపై ఇంకా స్పష్టత రాలేదు. గతేడాది కంటే రికార్డుస్థాయిలో భవానీ దీక్షధారుల సంఖ్య గణనీయంగా పెరిగినా.. ఉత్సవాల రోజుల్లో ఈ సంఖ్య కనిపించే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. సాధ్యమైనంత త్వరగా జిల్లా యంత్రాంగం దీనిపై నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. భవానీలు దీక్షలను విరమించిన తర్వాత ఇరుమడులను హోమగుండంలో వేస్తేనే తమ దీక్షకు పరిపూర్ణత ఉంటుందని భావిస్తారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2016 నుంచి 2019 వరకు హోమగుండాలను ఏర్పాటు చేయటం ద్వారా దసరా ఉత్సవాల సమయంలో భారీ సంఖ్యలో భవానీలు వచ్చేవారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కరోనాకు ముందు, తర్వాత కూడా హోమగుండాలను ఏర్పాటు చేయటం ఆపివేశారు. నాడు భవానీలు ఎంతో పవిత్రంగా భావించే హోమగుండాన్ని ఏర్పాటు చేయలేదన్న విమర్శలు వచ్చాయి. భవానీలు, గురుభవానీలు అధికారుల చర్యలను తప్పుబట్టేవారు. హోమగుండాలు ఏర్పాటు చేయకపోవటం వివాదాలకు దారి తీసేది. ప్రస్తుతం ప్రభుత్వం మారటంతో హోమగుండాల ఏర్పాటు జరుగుతుందని భావించిన భవానీలకు ఇప్పటివరకు స్పష్టత రాలేదు. భవానీదీక్షలకు సంబంధించి విరమణల సందర్భంలో రెండు సంఘాలు క్రియాశీల పాత్ర పోషిస్తుంటాయి. ఆలిండియా భవానీదీక్షల చారిటబుల్ ట్రస్ట్, ఏపీ భవానీ దీక్షా సంఘం. రెండూ కూడా దీక్షల విరమణను చేపడుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు ఆలిండియా ఛారిటబుల్ ట్రస్ట్‌ను పక్కన పెట్టారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో, హోమగుండం ఏర్పాటుకు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ఆలిండియా భవానీ దీక్షల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తిరుగుతున్నారు. ఇప్పటి వరకు స్పష్టత లేకపోవటంతో భవానీలలో ఆందోళన నెలకొంటోంది. హోమగుండం ఏర్పాటు దసరా ఉత్సవాలలో కుదరకపోవచ్చునని, ఉత్సవాల తర్వాత రోజు నుంచి ఏర్పాటుచేస్తామని దేవస్థాన అధికారుల నుంచి సంకేతాలు రావటంతో.. భవానీలంతా దసరా ఉత్సవాలకు దూరంగా ఉంటున్నారు. గత నాలుగు రోజులుగా భవానీలు కనిపించటం లేదు. మంగళవారం స్వల్పంగా కనిపించినా.. ఈ ఏడాది దసరా ఉత్సవాలకు 60 వేలలోపు మాత్రమే రావచ్చని తెలుస్తోంది. కిందటేడాది కంటే రికార్డుస్థాయిలో 3 లక్షలమంది భవానీలు దీక్ష చేపట్టారు. దసరా ఉత్సవాలలో విరమణలు చేసే వారిసంఖ్య ఇది. ఈనెల 13వ తేదీన ఒక్క రోజే అమ్మ సన్నిధిలో దీక్షా విరమణలు చేయటానికి 1.50 లక్షల మంది రానున్నట్టు గురుస్వాములు చెబుతున్నారు. మిగిలిన ఐదు రోజుల్లో 50 వేలమంది చొప్పున చూస్తే ఈసారి 2లక్షల మందికి సంఖ్య పెరుగుతోంది. దసరా ఉత్సవాల తర్వాత రోజుల్లో హోమగుండం ఏర్పాటు చేసిన తర్వాత మరో లక్ష మందికి పైగా వస్తారని గురుస్వాములు చెబుతున్నారు. ఈ సారి దసరా ఉత్సవాలలో 70 వేల మంది భవానీలు కూడా దాటడం కష్టంగా మారే పరిస్థితి కనిపిస్తోంది. హోమగుండం ఏర్పాటుపై దేవస్థాన అధికారులు తగిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



చెత్త నుంచి సంపద తేవాలి

» తడి చెత్తతో కంపోస్టు ఎరువులు
» మునిసిపల్ రీజినల్ డైరక్టర్ నరసింహారావు



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 8 : చెత్తనుంచి సంపదను తయారు చేసేందుకు ప్రతీ మునిసిపాలిటీ విధిగా ప్రణాళికను రూపొందించాలని మునిసిపల్ రీజినల్ డైరక్టర్ సీహెచ్ నాగ నరసింహారావు సూచించారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన మునిసిపల్ కమిషనర్లతో మంగళవారం మచిలీపట్నం నగరపాలక సంస్థ కార్యాలయంలో తడిచెత్త, పొడి చెత్తలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో చెత్తసేకరణ, స్థలం, కాంట్రాక్టర్ల వివరాలపై చర్చించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేసి ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. వచ్చే గురువారం నాటికి మునిసిపల్ కమిషనర్లు పూర్తిస్థాయిలో కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలన్నారు. మచిలీపట్నం డంపింగ్ యార్డు నుంచి చెత్తను గుంటూరుకు చెందిన జిందాల్ ప్లాంటుకు తరలిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి మునిసిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. మచిలీపట్నం కమిషనర్ బాపిరాజు మాట్లాడుతూ, నగరంలో ప్రతిరోజూ 84 టన్నుల చెత్త వస్తుండగా.. డంపింగ్ యార్డులో లక్ష టన్నుల చెత్త ఉందన్నారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్ ద్వారా రూ 3 కోట్లు కేటాయించామన్నారు. కార్యక్రమంలో తాడిగడప, పెడన, కొండపల్లి, తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



విజయవాడ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌పై ప్రయాణికుల రద్దీ

రైళ్లు ఫుల్!

» ఉత్తరాంధ్ర భక్తుల కోసం 16 స్పెషల్ రైళ్లు
» పీఎన్‌బీఎస్‌లోనూ ప్రయాణికుల సందడి
» 11 స్పెషల్స్ నడిపిన ఆర్టీసీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : దసరా పండుగ సమీపిస్తుండటంతో ప్రయాణికుల రద్దీ పెరుగుతోంది. మంగళవారం పండగ ప్రయాణాలతో విజయవాడ రైల్వేస్టేషన్ కిటకిటలాడింది. ఏ ప్లాట్‌ఫామ్‌పై చూసినా ప్రయాణికుల రద్దీనే.. రైళ్లు నిండుగా నడిచాయి. బోగీలలో తోపులాటలు జరిగాయి. రైళ్లకోసం ప్రయాణికులు ప్లాట్‌ఫామ్‌ల మీదనే పడిగాపులు పడ్డారు. నగరంలోని వలస కూలీలు పెద్దసంఖ్యలో కుటుంబసభ్యులతో కలిసి సొంతూళ్లకు వెళ్లటానికి తరలిరావటంతో స్టేషన్ కిటకిటలాడిపోయింది. దీనికితోడు ప్రైవేటు కళాశాలలకు వరుసగా అవుటింగ్‌లు ఇస్తుండటంతో దూర ప్రాంతాలు వెళ్లేవారంతా రైళ్లలో ఎక్కువ సంఖ్యలో ప్రయాణించారు. దీంతో మంగళవారం స్టేషన్‌లో అసాధారణ రద్దీ కనిపించింది. విజయవాడలో జరిగే దసరా ఉత్సవాలకు కూడా పెద్ద సంఖ్యలో ఇతర ప్రాంతాలనుంచి భక్తులు రైళ్లలో వస్తున్నారు. ప్రధానంగా ఉత్తరాంధ్ర నుంచి భారీసంఖ్యలో భక్తులు వస్తున్నారు. కనకదుర్గమ్మ భక్తులను దృష్టిలో ఉంచుకుని విజయవాడ-శ్రీకాకుళం రోడ్ మధ్య 16 దసరా స్పెషల్ రైళ్లను నడుపుతున్నట్టు మంగళవారం రైల్వే అధికారులు ప్రకటించారు. అమ్మవారి మూలానక్షత్రం రోజునుంచి ఈ నెల 18 వ తేదీవరకు విజయవాడ-శ్రీకాకుళం రోడ్ (07215), శ్రీకాకుళంరోడ్-విజయవాడ (07216)లను నడపనున్నట్టు ప్రకటించింది. ఉత్తరాంధ్ర నుంచి వచ్చే వారికోసం ఈ నెల 9, 10, 11, 12, 14, 15, 16, 17వ తేదీలలో వరుసగా ఈ స్పెషల్ రైళ్లు నడుస్తాయి. అలాగే విజయవాడలో కనకదుర్గమ్మను దర్శించుకున్న భక్తులు తిరిగి తమ స్వస్థలాలకు వెళ్లటానికి వీలుగా ఈనెల 10, 11, 12, 13, 15, 16, 17, 18 తేదీలలో స్పెషల్ రైళ్లను నడపనున్నారు.

బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల సందడి..

పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో అసాధారణ రద్దీ కనిపించనప్పటికీ.. ప్రయాణికులతో సందడిగా మారింది. రెగ్యులర్ బస్సులన్నీ దాదాపుగా ఫుల్ అయ్యాయి. మూలా నక్షత్రం ముందురోజు కాబట్టి భారీసంఖ్యలో ప్రయాణాలు ఉంటాయన్న ఉద్దేశ్యంతో మంగళవారం 80బస్సుల వరకు అధికారులు సిద్ధం చేశారు. ప్రయాణికుల రద్దీ ఆ మేరకు కనిపించకపోవటంతో 40 బస్సుల వరకు వెనక్కు పంపించారు. ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని 11 స్పెషల్ సర్వీసులను నడిపినట్టు ఆర్టీసీ పీఎన్‌బీఎస్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ నర్రా శ్రీనివాసరావు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. మూలానక్షత్రం రోజున ప్రయాణికుల డిమాండ్ అనూహ్యంగా ఉంటుందన్న ఉద్దేశ్యంతో దానికి తగ్గట్టుగా ప్లాన్ చేశామని ఆయన చెప్పారు.

న్యూస్ బాక్స్

కిడ్నీ మహమ్మారికి మరొకరు బలి



గుగులోతు చిన్న

ఎ.కొండూరు : ఎ.కొండూరు మండలంలో కిడ్నీ మరణాలు కొనసాగుతూనే ఉన్నాయి. డయాలసిస్ చేయించుకోలేక వ్యాధి తీవ్రతతో మరొకరు మృతి చెందారు. కుమ్మరకుంట్ల గ్రామానికి చెందిన గుగులోతు చిన్న (55) కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యుల సలహామేరకు కొద్ది రోజులు మందులు వాడినా ఇటీవల వ్యాధి తీవ్రత పెరిగింది. భయంతో డయాలసిస్ చేయించుకోలేదు. ఇటీవల సీరమ్ క్రియాటిన్ శాతం 9కి చేరి మంగళవారం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

అక్రమార్కులపై చర్యలేవి?

(7వ పేజీ తరువాయి)

వర్క్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వ్యక్తిని వైసీపీ ప్రభుత్వం వచ్చాక మోపిదేవి మండలం ఏఈగా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించారు. మోపిదేవి, కోసూరివారిపాలెం గ్రామాల్లో గిరిజనుల గృహాలను ఈ ఏఈనే కాంట్రాక్టుకు తీసుకుని నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో ప్రతి పనికి ఒకరేటు నిర్ణయించి లబ్ధిదారుల నుంచి పెద్ద మొత్తంలో నగదు వసూలు చేశాడనే ఆరోపణలున్నాయి. మండలంలోని మిగిలిన గ్రామాల్లో సైతం ఇదే విధంగా వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం. ఏఈ పనితీరుపై అనేక ఫిర్యాదులు అందడంతో అధికారులు విచారణ జరిపి మోపిదేవి మండలం నుంచి జిల్లా కార్యాలయానికి పంపారు. మోపిదేవి మండలానికి వేరొక ఏఈని నియమించినా.. పాత ఏఈ మోపిదేవిలోనే ఉండటం గమనార్హం. మోపిదేవి మండలంలోనూ పెద్దమొత్తంలో ఇనుము, సిమెంటు మాయం కాగా, కొందరు పెద్దల సహకారంతో ఈ విషయం బయటకు రాకుండా తెరవెనుక మంత్రాంగం నడుపుతున్నారనే ఆరోపణలున్నాయి. నియోజకవర్గంలో జరిగిన అక్రమాలపై గృహనిర్మాణశాఖ, విజిలెన్స్ అధికారులు విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. ఈ నివేదిక బయటకు రాకుండా, అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోకుండా తెరవెనుక కొందరు రెగ్యులర్ అధికారులు, పెద్దలు వ్యవహారం నడపడం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో అవనిగడ్డ శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్ గృహనిర్మాణశాఖలో పనిచేసే అధికారులు తనవద్దకు రావద్దని ఖరాఖండిగా చెప్పినట్లు ఆ శాఖ ఉద్యోగులు పేర్కొంటున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

శివాలయం నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 8 : స్థానిక ధర్మ కోనేరు చెరువు గట్టుమీద గ్రామస్థులు నిర్మిస్తున్న భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి నూజివీడు రోడ్డు లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు (బాబు) అరుణ దంపతులు మంగళవారం రూ.2 లక్షలు విరాళం అందించారు. ఆలయ నిర్వాహకులు గూడవల్లి చిన్నా, వీరమాచనేని నాగయ్యలకు చెక్కు రూపంలో విరాళాన్ని అందజేశారు. తమిరి రమేష్ పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న కాకాని బాబు

మద్యం షాపులకు 282 దరఖాస్తులు

ఉయ్యూరు, అక్టోబరు 8 : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉయ్యూరు సర్కిల్ పరిధిలో మద్యం షాపులకు మంగళవారం నాటికి 282 దరఖాస్తులు వచ్చినట్టు సీఐ సీహెచ్ శేషగిరిరావు తెలిపారు. సర్కిల్ పరిధిలో ఉయ్యూరు, కంకిపాడు, పెనమలూరు, తోట్లవల్లూరు, పమిడిముక్కల మండలాలకు గాను 30 షాపులకు దరఖాస్తులకు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. దరఖాస్తుల స్వీకరణ బుధవారంతో ముగియనుంది. స్వీకరణ ప్రారంభించి, ఐదు రోజులు గడుస్తున్నా ఆశించినంత మేర రాకపోవడంపై సర్వత్రా చర్చ నెలకొంది.

14 నుంచి పల్లెపండగ పనులు

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 8 : గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు పల్లె పండగ కార్యక్రమంగా నిర్వహించనున్నట్లు బాపుల పాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ మంగళవారం నిర్వహించిన వీసీ మీటింగ్‌లో దిశానిర్దేశం చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. మండలానికి రూ.7కోట్లు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. గ్రామా ల్లో చేపట్టే సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు ఇతర పనులను పల్లెపండగ కార్యక్రమంగా ప్రారంభం రోజున భూమిపూజ నిర్వహించి చేపట్టాలని సూచించారన్నారు. ఎమ్మెల్యే సూచనలు మేరకు షెడ్యూల్ నిర్ణయించి పనులు ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు వివరించారు. సమావేశంలో ఈవో పీఆర్డీ కె.లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లింగమూర్తి కుటుంబ సభ్యులకు మంత్రి పార్థసారథి పరామర్శ



ఉయ్యూరు, అక్టోబరు 8 : సుధీర్ టింబర్‌డిపో అధినేత, ప్రముఖ పారిశ్రామిక వేత్త నూకల లింగమూర్తి కుటుంబ సభ్యులను గృహనిర్మాణ, పౌరసంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పరామర్శించారు. లింగమూర్తి ఇటీవల మృతిచెందగా యాకమూరులో ఆయన నివాసంలో ఆయన కుటుం సభ్యులు నూకల సాంబశివరావు, హనుమంతరావు, సుధీర్, మోహన వంశీకృష్ణలను సారథి కలసుకుని పరామర్శించారు. ఉత్తమ పారిశ్రామికవేత్తగా పురస్కారం అందుకుని, ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎందరికో ఉపాధి కల్పించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేసిన మూర్తి మృతి తీరని లోటన్నారు.

ముగిసిన వార్డు సభ్యుల శిక్షణ

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 8 : బాపులపాడు మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులు పాటు నిర్వహించిన మొదటి బ్యాచ్ వార్డు సభ్యులు, ఉప సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఎంపీడీవో కె. జోగేశ్వరరావు ఆధ్వర్యంలో పంచాయతీ రోజువారీ పరిపాలన, ఆదాయ వనరులు, పారిశుధ్య తదితర అంశాలపై కానుమోలు పంచాయతీ కార్యదర్శి సుభాష్ శిక్షణ ఇచ్చారు. గ్రామానికి ఇద్దరు వార్డు సభ్యులు, ఉప సర్పంచ్‌లు హాజరయ్యారు. బుధ, గురువారం రెండవ బ్యాచ్‌కి శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె.లక్ష్మయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 8 : వేలేరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున బుధవారం విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని ఏఈ మురళీకృష్ణ తెలిపారు. వేలేరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 8 : స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామికి ఆలయ అర్చకులు మారేపల్లి సీతారామాను జాచార్యులు అభిషేకాలు, అర్చనలు జరిపారు. స్థానిక వెంకాయమ్మ భజన సమాజం భక్తి గీతాలాపన చేశారు.

హనుమాన్‌నగర్ వాసులకు న్యాయం జరిగేలా కృషి: వైవీబీ

ఉయ్యూరు, అక్టోబరు 8 : ఉయ్యూరు నగర పంచాయతీ పరిధి హనుమాన్‌నగర్‌లో నివసిస్తున్న వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. 16వ వార్డు హనుమాన్‌నగర్ భూములు 22ఏ జాబితా నుంచి తొలగించేందుకు కృషి చేయాలని కోరుతూ స్థానికులు మంగళవారం రాజేంద్రప్రసాద్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. దీనిపై మండల తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి న రాజేంద్రప్రసాద్ సమస్య పరిష్కరించాలని కోరారు. జంపాన నరసింహారావు, నాగబాబు, శోభనాద్రి తదితరులు రాజేంద్రప్రసాద్‌ను కలిశారు.

మారేడుమాక అభివృద్ధికి ప్రణాళిక

సమస్యల పరిష్కార వేదిక సభలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్



గ్రామ సమస్యలపై ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సర్పంచ్ ఆదర్శ్

మారేడుమాక (కంకిపాడు), అక్టోబరు 8 : అధికారంలోకి వచ్చిన ఈ మూడు నెలల్లో మారెడుమాక అబివృద్ధికి రూ. 46 లక్షలతో ప్రణాళికలు రూపొందించటం జరిగిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని మారేడుమాకలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంకిపాడు మండలంలోని మారేడుమాక, గొల్లగూడెం గ్రామాల్లో 2014, 2019, 2024 ఎన్నికల్లో మూడు సార్లు తనకు మెజారిటీ రాలేదన్నారు. అయినా నిరుత్సాహానికి గురి కాకుండా రెట్టించిన ఉత్సాహంతో పనిచేశానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వల్ల అనేక మంది అర్హులు తమ పింఛన్లను కోల్పోయారని మండిపడ్డారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ల పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ ఆదర్శ్ గ్రామంలో నెలకొన్న సమస్యలు మారేడుమాక నుంచి తరిగొప్పుల ప్రధాన రహదారి, మారేడుమాక - మానికొండ లింకు రోడ్డు, బీసీ ఏరియాలో రామాలయం రోడ్డు, మెయిన్ రోడ్డు - అంగన్ వాడీ వెళ్లే ప్రధాన రహదారి, పలు ప్రధాన రహదారులు సీసీ రోడ్లు, డ్రెయిన్లు, ఎస్సీ, ఓసీ శ్మశాన వాటికల ప్రహరీ, ఆర్టీసీ బస్సు సదుపాయం వంటి అనేక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆదర్శ్, తహసీల్దార్ భవన్నారాయణ, ఎంపీడీవో అనూష, టీడీపీ, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త ముప్పా రాజా, టీడీపీ మండల అధ్యక్షులు సుది మళ్ల రవీంద్ర, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఊసల రామయ్య, నాయకులు యార్లగడ్డ రాజా, ఉద్దండి కుటుంబరావు, సూరపనేని మురళి, వీరయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించాలి

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



ఆలపాటి పరిచయ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, అక్టోబరు 8 : కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలల్లో కూటమి అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం అందరిపైన ఉందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పరిచయ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, వచ్చే ఏడాది మార్చిలో జరగబోయే పట్టభద్రుల ఎన్నికలలో తనకన్న ఎక్కువ మెజార్టీని నియోజకవర్గంలో చూపించాలన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని ఆరోపించారు. అరాచకాల వల్ల అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు వంద రోజుల పాలనలో సంక్షేమం, అభివృద్ధి పథకాల ద్వారా లబ్ధిపొందుతున్న ప్రజలంతా సంతోషంగా ఉన్నారని చెప్పారు. జగన్ పాలనలో నిర్వీర్యమైన వ్యవస్థలన్నింటిని చంద్రబాబు చక్కదిద్దుతున్నారని తెలిపారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయటం పట్ల సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు పట్టభద్రుల ఓటు హక్కు ఎలా పొందాలో వివరించారు. నియోజకవర్గ పరిశీలకులు వడ్రాణం హరిబాబు నాయుడు, కూటమి నాయకులు చలమలశెట్టి రమేష్, జాస్తి వెంకటేశ్వరరావు, ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, వేములపల్లి శ్రీనివాసరావు, గొడ్డళ్ల చినరామారావు, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామూషిక నివారణ చేపట్టాలి

పెనమలూరు, అక్టోబరు 8 : మండలంలోని యనమలకుదురు, గంగూరు గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం జరిగింది. ఆయా గ్రామాల్లో రైతులకు ఎలుకల నిర్మూలన మందు బ్రోమోడయోలిన్‌ను పంపిణీ చేశారు. రైతులు సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టాలని ఏవో శైలజ సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఏఓ ఎన్ పద్మావతి, గ్రామ వ్యవసాయ సిబ్బంది జమిలా అంజుమ్, శ్రీవాణి, అహల్య పాల్గొన్నారు.

కుందేరులో ..



కుందేరులో పొలంపిలుస్తుంది

కంకిపాడు : రైతులు సామూహికంగా ఎలుకల నివారణకు కృషి చేయాలని కంకిపాడు ఏవో పి.ఎం. కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కుందేరులో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులకు అవసరమైన ఎలుకల మందును ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలియజేశారు. వ్యవసాయ సహాయకులు కె. సురేష్, ఎం. శ్రీనివాస్, బి. నాగరాణి, రైతులు పాల్గొన్నారు.

బొల్లపాడులో ..



బొల్లపాడులో..

ఉయ్యూరు : పొలాల్లో ఎలుకల నిర్మూలన రైతులు సామూహికంగా చేపట్టి మంచి ఫలితాలు సాధించవచ్చని వ్యవసాయశాఖ గన్నవరం ఏడీ ఎన్.సునీల్ అన్నారు. బొల్లపాడులో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పలుసూచనలు చేశారు. డీడీఏ మనోహర్, ఎఫ్‌టీసీ ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో నిస్సీగ్రేస్, ఎంపీటీసీ గంగారత్నం పాల్గొన్నారు.

కానుమోలు, బాపులపాడుల్లో..



ఎలుకల మందు పంపిణీ చేస్తున్న ఎంపీపీ నగేష్

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : కానుమోలు, బాపులపాడు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం ఎలుకల మందు తయారు చేసే విధానం, క్షేత్రస్థాయిలో ఎలుకల నివారణకు తీసుకోవాలసిన చర్యలపై వ్యవసాయశాఖ సిబ్బంది సోదాహరణంగా చేసి చూపుతూ రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యరగొర్ల నగేష్, జెడ్పీటీసీ గంగాభవాని, రంగన్నగూడెం టీడీపీ నాయకుడు మొవ్వా వేణుగోపాల్, దుట్టా శివన్నారాయణ, అట్లూరి శ్రీనివాస్ తదితరులతో పాటు రైతులు పాల్గొన్నారు.



పురుషోత్తపట్నంలో..

పురుషోత్తపట్నం, కొండపావులూరులో..

గన్నవరం : మండలంలోని పురుషోత్తపట్నం, కొండపావులూరు గ్రామాల్లో పొలం పొలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సామూహిక ఎలుకల నివారణ మందును పంట పొలాల్లో వేయించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్.పద్మావతి మాట్లాడుతూ హెక్టారుకు వంద గ్రాములు విషపు ఎరతయారీకి రెండు గ్రాముల బ్రోమోడయోలిన్ మందు, 96 గ్రాముల నూకలు రెండు గ్రాముల నూనె కలిపి ఒక్కొక్క ఎలుక బొరియ వద్ద పది గ్రాముల చొప్పున పొట్లాలు కట్టి వాటిల్లో వేయాలన్నారు. డీఆర్‌సీ ఏవో పద్మజ, ఏవో ఎస్ఎల్ తేజస్వీ, పలువురు రైతులు పాల్గొన్నారు.

సిరులు కురిపించే మహాలక్ష్మిగా..



ప్రసాదంపాడు, అక్టోబరు 8 : విజయవాడ రూరల్ మండలం రామవర ప్పాడులోని వెంకమ్మ పేరంటాలమ్మ దేవస్థానంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో 6వ రోజు అమ్మవారు మహాలక్ష్మిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తన్మయి బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన నిచ్చింది.

యాదవుల రామాలయంలో..



గన్నవరం : స్థానిక యాదవుల రామాలయంలో మంగళవారం మహాలక్ష్మిదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పాత గన్నవ రం లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో పలువురు దంపతులు సామూహిక పూజలు నిర్వహించారు. కేసరపల్లి, దావాజీగూడెం, పురుషోత్తపట్నం, ముస్తాబాదల్లో శరన్నవ రాత్రుల మహోత్సవాలు జరుగుతున్నాయి.

ఆత్కూరు కనకదుర్గ ఆలయంలో.



ఉంగుటూరు : ఆత్కూరు శ్రీకనకదుర్గ ఆల యంలో అమ్మవారు 100, 200, 500 కరెన్సీనోట్లతో మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. లంకపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో మహాలక్ష్మీదేవి స్వరూపంలో దర్శన మిస్తున్న దేవికి పూజలు నిర్వహించారు.

మహాలక్ష్మిగా రాజ్యలక్ష్మి



హనుమాన్‌జంక్షన్ : స్థానిక లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మి అమ్మవారిని శరన్నవరాత్రులు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మహాలక్ష్మీగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలు తాడేపల్లి విజయకృష్ణ, మాధవిలత దంపతుల సహకారంతో అమ్మవారిని అలంకరించారు.

రంగన్నగూడెం, వీరవల్లిలో..



హనుమాన్‌జంక్షన్‌రూరల్: రంగన్నగూడెం, వీరవల్లి, రంగయ్యప్పారావుపేట, కొత్తపల్లి తదితర గ్రామాల్లో దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి నోట్లదండలతో అలంకరించారు.

కంకిపాడులో..



కంకిపాడు : కంకిపాడుతో పాటు ప్రొద్దుటూరు శివాలయాల్లో అమ్మవారు భక్తులకు మహాలక్ష్మిదేవిగా భక్తులకు దర్శన మిచ్చింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సోమేశ్వరస్వామి ఆలయంలో..

ఉయ్యూరు : సోమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి పూజలు చేశారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు నర్రా సుధారాణి ఆధ్వర్యంలో శరన్నవ రాత్రి పూజలు దిగ్విజయంగా నిర్వ హిస్తున్నారు. చిన ఓగిరాల మారుతీ నగర్‌లో ఏర్పాటు చేసిన దుర్గమ్మ మండపంలో దీలీప్ తదిరులు భవాని దీక్షలో పూజలు చేస్తున్నారు. పెద ఓగిరాల, ముదునూరు. ఆకునూరు, వీరవల్లిలో ఉత్సవాలు నేత్రపర్వంగా నిర్వహిస్తున్నారు.



మర్యాదపూర్వక కలయిక

ఏపీఐఐసీ చైర్మన్ మంతెనను సన్మానించిన గొట్టిపాటి



పెనమలూరు, అక్టోబరు 8 : రాష్ట్ర ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజును ప్రముఖ న్యాయవాది, టీడీపీ అధికార ప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. గొట్టిపాటితో పాటు ఎన్టీఆర్ జిల్లా టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షులు మోటేపల్లి సత్యనారాయణ ఉన్నారు.


మత్తుపదార్థాల అనర్థాలపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ శేఖర్‌బాబు

ఉంగుటూరు, అక్టోబరు 8 : మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలకు బానిసలైన వారికి సరైన కౌన్సెలింగ్ ఇచ్చి డీఅడిక్షన్ సెంటర్లకు పంపించడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఆత్కూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జితేంద్రకుమార్ అన్నారు. నవజీవన్ బాలభవన్ (నూజివీడు) సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశా, ఆరోగ్యకార్యకర్తలకు మత్తుపదార్థాలు, సోషల్‌మీడియా దుర్వినియోగంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యసనాలకు బానిసలుగా మారి వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న యువతకోసం నీతోడు మానసిక వికాస కేంద్రాన్ని ఉచితంగా నిర్వహిస్తున్నామని, 9490492020కి ఫోన్‌చేసి సంప్రదించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో సీహెచ్ సాంబశివరావు, గ్రామసచివాలయ మహిళా కార్యదర్శి శిరీష, నీతోడు మానసిక వికాసకేంద్రం జోనల్ కోఆర్డినేటర్ దాసరి.విజయరాణి, ఆశా, ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు.





బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.525

పారదర్శకంగా మద్యం దుకాణాల కేటాయింపు జరగాలి

మచిలీపట్నం,అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాల కేటాయింపును పారదర్శకంగా చేయాలని కలెక్టర్ బాలాజీ ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈనెల 11వ తేదీన మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిన కేటాయించే ప్రక్రియకు సంబంధించిన చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలుసూచనలు చేశారు. మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వివరాలను మొబైల్‌ఫోన్‌లకు సమాచారం పంపాలన్నారు. నోబుల్‌కళాశాల ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు చేయాలని మచిలీపట్నం ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.గంగాధరరావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ సి.భార్గవ్‌లకు సూచించారు.



అర్తమూరులో రూ.5 లక్షల నోట్లతో అలంకారం



చల్లపల్లి మండలం రామానగరంలో రూ.8 లక్షల నోట్లతో అలంకారం



కోడూరు, నరసింహాపురంలోలో ధనలక్ష్మిగా దుర్గమ్మ

మహాలక్ష్మిగా దుర్గమ్మ

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 8 : మచిలీపట్నంలోని ప్రధాన దేవాలయాల్లో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. **పెడన :** పైడమ్మ మహాలక్ష్మీదేవిగా భక్తులను కటాక్షించారు. ఈవో టి.వి.వి. మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త తోట రామారావు పర్యవేక్షించారు. **గూడూరు :** మల్లవోలు ముత్యాలమ్మ మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. **బంటుమిల్లి :** అర్తమూరు రామాలయంలో అమ్మవారు ధనలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. దాదాపు రూ.5 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. గ్రామ ప్రముఖులు మోతుకూరి సీతారామయ్య, భక్తులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు :** వేమవరం కొండాలమ్మ మంగళవారంగజలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కుంకమార్చన, హోమం నిర్వహించారు. **అవనిగడ్డ :** లంకమ్మ అమ్మవారిని రూ.6 లక్షల నగదుతో ధనలక్ష్మిగా అలంకరించారు. **కోడూరు :** కోడూరులో కనకదుర్గమ్మ మహాలక్ష్మీదేవిగా, నరసింహాపురం రామాలయం వద్ద మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. **మోపిదేవి :** పెదకళ్లేపల్లిలో అమ్మవార్లను కరెన్సీ నోట్లతో అలంకరణ చేశారు. దుర్గానాగేశ్వరస్వామి దేవస్థానంలో ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. **చల్లపల్లి :** స్థానిక కన్యకా పరమేశ్వరి, కాశీవిశ్వేశ్వరస్వామి, నడకుదురు పృథ్వీశ్వరస్వామి, లక్ష్మీపురం దుర్గా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి, రామానగరం, వెలివోలులో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా కరెన్సీ నోట్లతో అలంకరించారు. చింతలమడ రామాలయం వద్ద సిద్దినేని శివకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ విగ్రహం వద్ద విశేష పూజలు జరిపారు. అక్షయ్. సునీల్, వంశీ, చరణ్, తరుణ్, ఫణి, తేజ, సుధీర్, చందు, నవనీత్, సాయి, సాయిరామ్, వేణు తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్ :** మోదుమూడిలో కనకదుర్గమ్మ, వేకనూరు అంకాలమ్మ మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమివ్వగా, ఆలయ నిర్వాహకులు మాదివాడ శ్రీనివాస పెరుమాళ్లు ఏర్పాట్లు పర్యవేక్షించారు. **నాగాయలంక :** గణపేశ్వరం దుర్గమ్మ, శ్రీరామపాదక్షేత్రం దుర్గమ్మ , కన్యకా పరమేశ్వరి మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఆలూరి శ్రీనివాసరావు, చిట్టా సాంబశివరావు పర్యవేక్షించారు. **ఘంటసాల :** జోడుగూడెం దళితవాడలో అమ్మవారిని విశేషంగా అలకరించి, సుహాసిని పూజలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నవరాత్రి మహోత్సవాలను వరసిద్ధి వినాయక యూత్ సభ్యులు పర్యవేక్షించారు. **కూచిపూడి :** మొవ్వ శ్రీరుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో అమ్మవారు గజలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కూచిపూడి బాలాత్రిపుర సుందరిదేవి, చినముత్తేవి అన్నపూర్ణా సమేత శ్రీ సోమేశ్వరస్వామి, మొవ్వ భీమేశ్వరస్వామి ఆలయాలతోపాటు అయ్యంకి, పెడసనగల్లు, నిడుమోలు, కాజ, కోసూరు పెదపూడి, భట్లపెనుమర్రు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. **గుడివాడ :** భీమేశ్వరస్వామి దేవస్థానంలో గాయత్రీ దేవిగా, వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సంతానలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈవో కె.వి గోపాలరావు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. **పామర్రు :** శివాలయంలో ధనలక్ష్మిగా, అంకమ్మతల్లి మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. **పెదపారుపూడి :** భూషణగుళ్ల లక్ష్మీ అలంకారంలో ఉన్న అమ్మవారిని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులను ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. గోగ్గం రామారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెదకళ్లేపల్లిలో..



అవనిగడ్డ లంకమ్మ..



లక్ష్మీపురం పంచాయతీ చింతలమడ రామాలయం వద్ద..



మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర, వేదికపై ఆలపాటి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, వేదవ్యాస్, రామకృష్ణ

ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం : రవీంద్ర

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 8 : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మచిలీపట్నం నుంచి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను బందరు గ్రాడ్యుయేట్లకు, కూటమి నాయకులకు కొల్లు రవీంద్ర పరిచయం చేశారు. నవంబరు 6వ తేదీ వరకు ఓట్ల నమోదు చేసేందుకు అవకాశం ఉందన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపుతో సత్తా ఏమిటో చూపించాలన్నారు.

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ, నాదెండ్ల మనోహర్ కోసం సీటు త్యాగం చేసిన ఆలపాటి రాజాను గెలిపించుకోవాల్సిన బాధ్యత జన సైనికులపై ఉందన్నారు. ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, ముడా మాజీ చైర్మన్ బూరగడ్డ వేదవ్యాస్, కొనకళ్ళ బుల్లయ్య, సీనియర్ టీడీపీ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెడన : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించుకుంటామని కూటమి నాయకులు స్పష్టం చేశారు. రాజేంద్రప్రసాద్ మంగళవారం కూటమి నాయకులను కలుసుకున్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, బూరగడ్డ వేదవ్యాస్, పరుచూరి అశోక్ బాబు పాల్గొని రాజేంద్రప్రసాద్‌ను పరిచయం చేశారు. పుప్పాల రామాంజనేయులు, పంచకర్ల తదితరులు పాల్గొన్నారు

తూర్పు బైపాస్‌కు ఇబ్బందులు లేకుండా చూడండి

• కలెక్టర్ బాలాజీ ఆదేశం

మచిలీపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఉంగుటూరు మండల పరిధిలోని జాతీయ రహదారి నెంబరు 16 పొట్టిపాడు నుంచి గుంటూరు జిల్లా కాజ వరకు 44 కిలో మీటర్ల మేర నిర్మాణం చేయనున్న తూర్పు బైపాస్ రహదారి నిర్మాణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ జాతీయ రహదారుల విభాగం అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జాతీయరహదారుల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. జాతీయరహదారుల కన్సల్టెంట్ మురళీ మాట్లాడుతూ బైపాస్ రహదారి నిర్మాణానికి రెండు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రెండోప్రతిపాదనలో గన్నవరం విమానాశ్రయానికి ఎలాంటి ఇబ్బందిలేకుండా, మచిలీపట్నం పోర్టుకు అనుసంధానంగా ఉండేలా ప్రణాళికనురూపొందించామన్నారు. ఈ రహదారికి ఎనిమిది పెద్దవంతెనలు, కృష్ణానదిపై 3.35 కిలోమీటర్ల మేర వంతెన నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. ఉంగుటూరు మండలం పొట్టిపాడు వద్ద ప్రారంభమై, గన్నవరం, కంకిపాడు, పెనమలూరు మండలంలోని గోసాల, వణుకూరు గ్రామాల మీదుగా గుంటూరు జిల్లాలోని దుగ్గిరాల మీదుగా మంగళగిరి మండలంలోని చిన కాకాని వద్ద విజయవాడ పశ్చిమ బైపాస్‌లో ఈ రహదారి కలుస్తుందన్నారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, జేసీ గీతాంజలి శర్మ, అధికారులు పాల్గొన్నారు.

పల్లె పండుగకు ఏర్పాట్లు చేయండి

జిల్లాలో పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. పల్లెపండుగ కార్యక్రమ నిర్వహణపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కలెక్టర్‌లతో మంగళవారం అమరావతి సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో రూ.168 కోట్లతో 2331 పనులను చేసేందుకు అంచనాలు రూపొందించామన్నారు. ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఈ పనులను ప్రారంభించాల్సి ఉందన్నారు. వచ్చే సంక్రాంతి నాటికి ఈ పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జడ్పీ సీఈవో కే కన్నమనాయుడు, డ్వామా పీడీ శివప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ఈ రమణారావు, డీపీవో జె అరుణ, హౌసింగ్ పీడీ వెంకట్రావ్ పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు ..

జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లుచేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి మంత్రి నిమ్మల రామానాయుడు కలెక్టర్‌లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అదేశాలమేరకు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ జిల్లాలో నీటిపారుదల శాఖ ఎస్ఈ పోస్టు భర్తీ చేయాలని కోరారు. కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలన్నారు. డీఆర్వో కే చంద్రశేఖరరావు, ఈఈలు పీవీ కృష్ణారావు, కొడాలి బాబు, ఆర్డీవోలు కే స్వాతి, బాలసుబ్రహ్మణ్యం, బీఎస్ హేలా షారోన్ పాల్గొన్నారు.

ఇంటర్ ఒరిజినల్ సర్టిఫికెట్లు పోయిన వారికి డూప్లికేట్‌ల జారీ

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 8 : వరద ప్రాంతాల్లో ఇంటర్మీడియట్ ఒరిజినల్ సర్టిఫికెట్‌లు కోల్పోయిన వారికి ఉచితంగా డూప్లికేట్ సర్టిఫికెట్‌లు జారీ చేసేం దుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పి.బి. సాల్మన్ రాజు తెలిపారు. సర్టిఫికెట్‌లు కోల్పోయిన వారు తాము చదివిన కళాశాల ప్రిన్సిపాల్స్ ద్వారా దరఖాస్తు పంపుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు సొంత డిక్లరేషన్, ఆధార్ జిరాక్స్ , అందుబాటులో ఉంటే సర్టిఫికెట్ జిరాక్స్ కాపీ దరఖాస్తుతో జతప రచాలన్నారు. వివరాలకు 8686935686 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు.



మేనేజర్ వెంకటరమణను సత్కరిస్తున్న లయన్స్ ప్రతినిధులు

ఎస్‌బీఐ మేనేజర్‌కు సత్కారం

గుడ్లవల్లేరు : ఎయిర్ ఫోర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విశ్రాంత ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి, గుడ్లవల్లేరు స్టేట్ బ్యాంక్ మేనేజర్ బత్తుల వెంకటరమణను గుడ్లవల్లేరు లయన్స్ ప్రతినిధులు మంగళవారం ఘనం గా సన్మానించారు. క్లబ్ అధ్యక్షురాలు శశికళ, కార్యదర్శి మేరుగు పెరుమాళ్ళ, ట్రెజరర్ కల్యాణపు నవాబు, ఉపాధ్యక్షుడు మత్తి శ్రీరామమూర్తి, జంగం మోహనరావు, పరంధామయ్య, బాలాజీ, వై.పి.సి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్థిక సాయం

గూడూరు : మల్లవోలుకు బండారు రాఘవులు మృతి చెందగా, అంత్యక్రియల నిమిత్తం హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ రూ. 5 వేల ఆర్థిక సాయాన్ని అందజేసింది. పత్తిపాటి శ్రీనివాసరావు, పత్తిపాటి నరసింహ, నాంచారయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణ

నందివాడ : ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు పంచాయతీ పాలనపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో పి.మల్లేశ్వరి అన్నారు. ఈవోపీఆర్డీ అమీర్ మీర్ బాషా అధ్యక్షతన జరిగిన శిక్షణలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రూపేష్, పంచాయతీ ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భార్యను గాయపర్చిన భర్తపై కేసు

గుడివాడ రూరల్ : భార్యను గాయపర్చిన భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. లింగవరం గ్రామానికి చెందిన కుప్పాల ఝాన్సీకి బాలాజీతో 16 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. మద్యానికి బానిసైన బాలాజీ ఈనెల 4వ తేదీన ఝాన్సీ తలను గోడకు కొట్టి గాయపర్చాడు. ఝాన్సీ ఫిర్యాదు మేరకు బాలాజీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంటిబాబు తెలిపారు.

50 పడకల స్థాయికి చల్లపల్లి ప్రభుత్వాసుపత్రి

చల్లపల్లి : చల్లపల్లి ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిని 50 పడకల స్థాయికి అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. కస్తూర్బా మెమోరియల్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం బుద్ధప్రసాద్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. 50 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలనీ, వైద్యుల పోస్టులు భర్తీ చేయాలనీ, పరికరాల ఏర్పాటు చేయాలని కోరుతూ సమావేశంలో తీర్మానించారు. ఎమ్మెల్యే మండలి మాట్లాడుతూ, ఆసుపత్రిలో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు దాతల సహకారంతో కృషి చేస్తామన్నారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రావణ్‌కుమార్, ఏపీఎంఐడీసీ ఈఈ నాగార్జునరావు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎ.వెంకటరమణ, ఈవో పి.వి.మాధవేంద్రరావు, ఎస్సై పిఎస్ వి.సుబ్రహ్మణ్యం, వరదా హరిగోపాల్, తోట కనకదుర్గ, కృష్ణవేణి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవనిగడ్డలో వైద్యుల పోస్టుల భర్తీ

అవనిగడ్డ : ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్, ఎం.ఎస్ సర్జన్ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ఆసుపత్రిలో ప్రసవాలు, ఓపి సంఖ్య పెరగాలని సూచించారు. ఆక్సీజన్ ప్లాంట్ వినియోగంలోకి తేవాలన్నారు. ఎక్స్‌రే తీయకుండా మచిలీపట్నం రిఫర్ చేస్తున్నారని కమిటీ సభ్యులు కొల్లూరి వెంకటేశ్వరరావు ప్రస్తావించారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రావణ్ కుమార్, ఏపీఎంఐడీసీ ఈఈ కె.నాగార్జున రావు, సూపరింటెండెంట్ డాక్టర్ జయకుమార్, ఎంపీడీవో మరియాదేవి, కార్యదర్శి అనిత, కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, వెంకటగిరి, కృష్ణకుమారి, ఏపీఎంఐడీసీ ఏఈఈలు రాములు, రాజేష్ పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని రూ.5 లక్షలకు టోకరా

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం నగర పాలక సంస్థలో ఉద్యోగం ఇప్పిస్తానని ఓ మహిళ నుంచి రూ. 5 లక్షలు తీసుకుని పరారైన ఓ ప్రబుద్ధుడి ఉదంతమిది. మచిలీపట్నం 25వ డివిజన్ సచివా లయంలో వలంటీర్‌గా పని చేసి రిజైన్ చేసిన రేకపల్లి నీలిమ దుర్గకు ఉద్యోగం ఇప్పిస్తామని బండారు సత్యనారాయణ, తమ్ము గంగా భవానీ, సురేష్ నమ్మబలికారు. నీలిమ దుర్గ నుంచి రూ. 5 లక్షలు తీసుకున్నారు. ఉద్యోగం వచ్చిందని నీలిమ దుర్గకు ఒక ఫేక్ ఆర్డర్ కాపీలు ఇచ్చారు. నీలిమ దుర్గ మునిసిపల్ కార్యాలయానికి వెళ్లి అడగ్గా అధికారులు మోసపోయావని తేల్చి చెప్పారు. బంగారు నగలను తాకట్టు పెట్టి రూ. 5 లక్షలు ఇచ్చానని వాపోయింది. లబోదిబోమంటూ ఇనకుదురు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలి

● మండల పరిషత్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ : నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై అధికారులు దృష్టిసారించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధికారులను ఆదేశించారు. ప్రజావేదికలో మండల పరిషత్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పల్లె పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, ఎంపీడీవో బి.వై విష్ణుప్రసాద్, మల్లీశ్వరీ, ఈవోపీఆర్డీ సారథి, ఏవో ఇమ్రాన్, పంచాయితీరాజ్ ఏఈ సూరిబాబు, ఉపాధి హామీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్ రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

పామర్రు : యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. కురుమద్దాలిలో మంగళవారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. మద్దాలి సంధ్యా ఆక్వా లిమిటెడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, డీమార్ట్, నవత ట్రాన్స్‌పోర్టు తదితర సంస్థల హెచ్‌ఆర్ ప్రతినిధులు ఇంటార్వ్యులు నిర్వహించి 195 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎమ్మెల్యే కుమార్ రాజా నియామకపత్రాలను అందజేశారు. జిల్లా ఉపాధి కల్పనా అధికారి డి.విక్టర్‌బాబు, స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ పి.నరేష్‌బాబు, మండల టీడీపీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, కొసరాజు వెంకటేశ్వరరావు, ప్రసాద్, రమేష్, సందీప్ పాల్గొన్నారు.

35 మంది ఉద్యోగాలకు ఎంపిక

అవనిగడ్డ : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖల ఆధ్వర్యంలో అవనిగడ్డలో నిర్వహించిన జాబ్ మేళాలలో 35 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అవనిగడ్డ డిగ్రీ కళాశాలలో జరిగిన జాబ్ మేళాలలో టెక్నో టాస్క్ బిజినెస్ సొల్యూషన్స్ నవత ట్రాన్స్‌పోర్టు, ప్రగతి మహిళా అకాడమీ ప్రతినిధులు పాల్గొనగా, 57 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా, 35 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా ఉపాధి కల్పన అధికారి విక్టర్ బాబు తెలిపారు. పి.నరేష్ కుమార్, ప్రిన్సిపాల్ ఉమారాణి, ఎస్.జయరాజు, వీరకుమారి, ముత్యాల వెంకటేశ్వరరావు, ఆర్.ప్రశాంత్, పృథ్వీజ తదితరులు పాల్గొన్నారు.



అవిరిపూడి, గుంటూకోడూరులో పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలి

కూచిపూడి : సామూహిక ఎలుకల నివారణతో అధిక దిగుబడులు సాధించవచ్చునని మొవ్వ మండల వ్యవసాయ శాఖాధికారి కె.శివప్రసాద్ తెలిపారు. ఆవిరిపూడి గ్రామంలో ఎలుకల నిర్మూలనకు రైతులు తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించారు. ఎలుకల నివారణ మందు తయారు చేసే విధానం వివరించారు. వీఏఏ నజీర్ అహ్మద్, రైతులు పాల్గొన్నారు. **గుడివాడ రూరల్ :** కల్వపూడి అగ్రహారం, గుంటాకోడూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో బోలెం అనంతలక్ష్మి ఎలుకల నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ప్రకృతి వ్యవసాయ ట్రైనర్ లక్ష్మీ, మార్కెట్ యార్డు సూపర్‌వైజర్, వీఏఏ డి.స్నేహ, కె.ఆశలత , రైతులు పాల్గొన్నారు. గుడ్లవల్లేరు : శేరిదగ్గుమిల్లిలో సామూహిక ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఏ స్వర్ణలత, ఏవో సునీల్, వీఏఏ యశ్వంత్‌రాజ్ పాల్గొన్నారు. **మోపిదేవి :** ఏవో హెబ్సిబా రాణి బొబ్బర్లంక, కొక్కిలిగడ్డ గ్రామాల్లో సామూహిక ఎలుకల నివారణపై అవగాహన కల్పించారు. గ్రామసర్పంచ్‌లు దిడ్ల జానకిరాంబాబు, దొప్పలపూడి గంగాభవాని, చందన రంగారావు, వ్యవసాయ శాఖ సహాయక ఉద్యోగులు ఉన్నారు.